క్లుప్తంగా

ఘనంగా రుద్రహోమం



వీరేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం నిర్వహిస్తున్న పండితులు

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకస్వామి పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో పలువురు పండితులచే పరమ శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని గణపతి పూజ, పుణ్యాహవచనం, రుద్రహోమం తదితర పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా సత్యమాంబ జాతర

ఐ.పోలవరం: మండలంలోని ఐ.పోలవరం గ్రామంలో వేంచేసి యున్న సత్యమాంబ అమ్మవారి 19వ జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. నాదస్వరం, సన్నాయి మేళం, గరగ నృత్యాలు, తంబూరా వాయిద్యాలు, బాణాసంచా కాల్పులతో జాతర ఉత్సవాలు అంబరాన్ని అంటాయి. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకొని మెక్కులు తీర్చుకొన్నారు. భారీ అన్న సమారాధనకు భక్తులు హాజరై ప్రసాదం స్వీకరించారు. ఆలయ అవరణలో చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు.

రైతు బజార్లను ప్రోత్సహించాలి



అమలాపురం రైతు బజార్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్: రైతు బజార్లలో కూరగాయలను కొనుగోలు చేసి ఆ బజార్లను ప్రోత్సహించాలని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) అన్నారు. అమలాపురం రైతు బజార్‌ను ఆదివారం ఉదయం ఎమ్మెల్సీ ఐవీ సందర్శించి అక్కడి దుకాణాల్లో కూరగాయలు కొనుగోలు చేశారు. లంక గ్రామాల్లో కూరగాయలు పండించే రైతులను దళారీ వ్యవస్థ నుంచి కాపాడేందుకు రైతు బజార్లలో కూరగాయలను కొనుగోలు చేయాలని ఎమ్మెల్సీ విజ్ఞప్తి చేశారు.

మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అంగాని

అల్లవరం: అల్లవరం మండలం కొమరగిరిపట్నం శివారు ఎస్.రామేశ్వరం గ్రామానికి చెందిన అంగాని శ్రీను రాష్ట్ర మత్స్యకార సంక్షేమ సమితి ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. గుంటూరు జిల్లా బాపట్లలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఉమ్మడి మహేష్, గౌరవాధ్యక్షులు మైలా అర్జునరావు ఆధ్వర్యంలో రాష్ట్ర మత్స్యకార సంక్షేమ సమితి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి తనకు అవకాశం కల్పించినట్లు శ్రీను తెలిపారు. జిల్లా నుంచి క్రీడా విభాగం అధ్యక్షులుగా బలగం రవివర్మ, జిల్లా వైద్య విభాగం అధ్యక్షులుగా అంగాడి ధనుంజయవర్మ, జిల్లా ఫెడరేషన్ అధ్యక్షులుగా లంకే బాలకృష్ణవర్మ నియమితులైనట్లు చెప్పారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

యానాం: ఆధునిక సాంకేతికత నేపథ్యంలో మొబైల్ ఫోన్‌ల ద్వారా లావాదేవీలు విరివిగా చేస్తున్నారని ఈ క్రమంలో పలువురు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకొని మోసపోతున్నారని అలాంటి వాటి పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్-1 ,2 యూనిట్ల ప్రత్యేక సేవా శిబిరంలో సైబర్ నేరాల అప్రమత్తతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దినదినం సైబర్ నేరాలు పెరిగి పోతున్నాయని అన్నారు. ఓటీపీ, లోన్ యాప్, డెబిట్ కార్డుల మోసాలు తదితర నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు ఖాతాలకు స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌లను సెట్ చేసుకోవడం ద్వారా సైబర్ నేరాల బారిన పడకుండా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు చెల్లే నరేష్, సిద్దిరెడ్డి శ్రీనివాస్, అధ్యాపకులు టి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పూజ

ముమ్మిడివరం: మండలంలోని అన్నంపల్లిలో రజకల సంఘం ఆధ్వర్యంలో రజకుల బల్లల పూజను ఘనంగా నిర్వహించారు. రజకులంతా ఊరేగింపుగా బయలు దేరి తమ కులదైవం వియమ్మ తల్లి, సత్తెమ్మ తల్లి అమ్మవార్లకు నైవేద్యాలను సమర్పించారు. అనంతరం అమ్మవారికి బోనాలు అర్పించారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అడ్డుకట్టలే ఆధారమాయె!

- అన్నదాతను కలవరపెడుతున్న సాగునీరు
- మల్లగుల్లాలు పడుతున్న శివారు రైతులు
- ప్రశ్నార్థకంగా మారిన రబీ సాగు
- క్రాస్‌బండ్లు ఏర్పాటు చేయాలని విన్నపం



వైఎస్సార్‌సీపీ హయాంలో నీటిని నిల్వ చేసేందుకు ఏర్పాటు చేసిన అడ్డుకట్ట (క్రాస్ బండ్)



ఉప్పలగుప్తం-పాయకరావుకోడు సమీపంలో నీటి ఎద్దటితో ఎండుతున్న వరిచేను

ఉప్పలగుప్తం: వరిసాగు చేయటం అంటే రైతుకు కత్తి మీద సాములా మారింది. ఖరీఫ్ సాగులో ఓ వైపు ముంపునీరు దిగక, మరోవైపు అధిక వర్షాలు, వరదలతో అష్ట కష్టాలపాలైన రైతన్నకు రబీ ఆరంభం నుంచి ఒడిదొడుకులే ఎదురవుతున్నాయి. ఖరీఫ్ కాలంలో చేలల్లో నీరు దిగక ముంపు బారి నుంచి ఆలస్యంగా బయట పడిన రైతులకు దాని ప్రభావం రబీ సాగుపై కనబడుతోంది. దమ్ము సమయంలో అధిక కలుపును నివారించటంతో పాటు, వాతావరణంలో తేమ ఎక్కువగా ఉండటంతో విత్తనాలు మొలకెత్తడంలో సైతం రైతులు తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. మరోపక్క సాగు నీటి ఎద్దడి వారిని ఆందోళనకు గురి చేస్తోంది. సాగుకు సిద్ధం చేసుకుని చేను దుబ్బు చేసి పంటకు మందు అందించే సమయానికి సాగునీటి ఆటంకంతో కొన్ని మెరక ప్రాంతాల్లో నీరు అందక వరిచేలు ఎండుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో పంటకు ఆధారం ఏమిటోనని రైతులు తలలు పట్టుకుంటున్నారు. వంతుల వారీ విధానాన్ని అమలు పరుచుకుంటున్న కొన్ని ప్రాంతాల్లో సాగు నీరు సక్రమంగా అందక రైతులు ఇంజిన్‌లతో నీటిని చేలకు తోడుతున్నారు. సాగుకు ఆటంకం లేకుండా నీరు సక్రమంగా అందించేలా అధికారులు చర్యలు తీసుకోకపోతే రబీ సాగుపై సైతం ఆశలు వదులుకోవాల్సిందేనని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు ముందస్తుగా నీటిని నిల్వ చేసే చర్యలు తీసుకోక పోతే తిప్పలు తప్పవని వాపోతున్నారు.

అమలాపురంలో నియోజకవర్గ పరిధిలోని రూరల్ మండలంలో 5,200, అల్లవరం మండలంలో 4 వేలు, ఉప్పలగుప్తం మండలంలో 6,600 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు జరుగుతుంది. రైతులు ఇప్పటికే ఉత్సాహంగా రబీసాగు చేపట్టారు. నీటి సంఘాల అధ్యక్షుల ప్రోత్సాహంతో వంతుల వారీ విధానాన్ని అమలు పరచుకుంటున్నారు. అయినప్పటికీ వరి సాగుకు ఉపయోగించుకోవల్సిన నీటిని మోతుబారు రైతులు ఆక్వా (చేప, రొయ్య) సాగుకు అధికంగా తోడుకుంటున్నారు. దీంతో శివారు ప్రాంతాల రైతులకు వెళ్లే సరికి వంతు ముగియటంలో నీరు పూర్తి స్థాయిలో అందే పరిస్థితి కనిపించటం లేదు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇటువంటి సమస్యను ముందుగానే గుర్తించి రబీ సాగు చేస్తున్న రైతుకు ఇబ్బంది లేకుండా డ్రెయిన్‌లపై అడ్డుకట్ట (క్రాస్ బండ్)లను వేసేవారు. ఈ క్రాస్ బండ్‌లతో ఎగువ ప్రాంతాల్లో వరిచేనుకు రైతు పెట్టుకున్న నీటిని డ్రెయిన్‌లోకి విడుదల చేసిన తరువాత ఆ నీరు వృథా పోకుండా డ్రెయిన్‌లో నిల్వ ఉండేది. దీనితో రైతుకు సాగునీటి అవసరం ఉన్నప్పుడల్లా వంతులతో పని లేకుండా డ్రెయిన్‌లో నిల్వ ఉంచిన సాగునీటిని చేలకు అందించుకునేవారు. ఇటీవల అమలాపురం ప్రాంతంలో గోదావరి సెంట్రల్ డెల్టా డిస్ట్రిబ్యూషన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కోనసీమలో ఉన్న డిస్ట్రిబ్యూషన్ కమిటీ సభ్యులంతా పాల్గొని ఇరిగేషన్, డ్రెయిన్స్ అధికారుల సమక్షంలో ప్రతి డ్రెయిన్‌పై క్రాస్ బండ్‌లను ఏర్పాటు చేయాలని తీర్మానించుకున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం నుంచి ఇంకా ఎటువంటి స్పష్టత రాలేదు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో నీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని, రానున్న 15 రోజుల్లో సాగుకు నీరు అందక మరిన్ని ఇబ్బందులు పడే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. త్వరితగతిన క్రాస్ బండ్‌లను ఏర్పాటు చేసి సాగుకు నీరు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నదాతలు అభ్యర్థిస్తున్నారు.

సాగునీరు అందక సతమతం



ఎనిమిది ఎకరాల్లో కౌలు వ్యవసాయం చేస్తున్నాను. నాట్లు వేసి 18 రోజులు గడిచింది. ఇప్పటికే సాగుకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నాను. రానున్న రోజుల్లో మరింత ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. గతంలో ఈ సమయానికి క్రాస్ బండ్‌లను ఏర్పాటు చేసేవారు. ఈ ఏడాది సాగుకు నీటి ఎద్దడితో మరింత ఆటంకం కలిగే పరిస్థితి కనిపిస్తుంది. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి క్రాస్ బండ్‌లను ఏర్పాటు చేయాలి.

దోనిపాటి వెంకటేశ్వరరావు, కౌలు రైతు, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం మండలం.

వేగం కన్నా ప్రాణం మిన్న




మాట్లాడుతున్న కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ

అమలాపురం టౌన్: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ, నడిపూడి వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో అవగాహన సదస్సు జరిగింది. అనంతరం ×అతి వేగం వద్దు.. సురక్షిత ప్రయాణం ముద్దు₹ అనే నినాదంతో జరిగిన కవి సమ్మేళనంలో పలువురు కవులు ట్రాఫిక్ నిబంధనలపై తమ కవితా గానాలు వినిపించారు. నడిపూడి వాకర్స్, లాఫింగ్ క్లబ్‌ల అధ్యక్షుడు, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన సదస్సులో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, కవి నల్లా నరసింహమూర్తి, గ్రంథాలయాధికారి జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ మాట్లాడారు. అతివేగం ప్రమాదాలకు చిరునామా అని పేర్కొన్నారు. నిదానమైన డ్రైవింగ్‌తో గమ్యస్థానానికి సురక్షితంగా చేరవచ్చన్నారు. చేతి వృత్తుల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి సదస్సులో మాట్లాడారు. కవి సమ్మేళనంలో కవులు నరసింహమూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొని వాహనాలు నడిపేడప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కవితా గానాలు వినిపించారు. సమావేశంలో సీనియర్ సిటిజన్స్, వాకర్స్ గున్నేపల్లి భీమశంకరం, కడలి సత్యనారాయణ, చెల్లుబోయిన మురళీకృష్ణ, పితాని మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భళారే బాలికా..!

- చిత్రకళలో ఔరా అనిపిస్తున్న నవ్యశ్రీ
- పలువురి ప్రశంసలు



నవ్యశ్రీ గీచిన వంగవీటి మోహన రంగా చిత్రం



పెన్సిల్ ఆర్ట్‌తో చిత్రాలు గీస్తున్న నవ్యశ్రీ

అమలాపురం టౌన్: పట్టణంలోని కల్వకొలను వీధికి చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని గోకరకొండ నవ్యశ్రీ సత్యలక్ష్మి చిత్రకళలో విశేషంగా రాణిస్తూ పలువురి ప్రశంసలు పొందుతోంది. ఎదుటి వ్యక్తిని చూచినదే తడవు ఆ రూపాన్ని క్షణాల్లో గీయటంలో నవ్యశ్రీ దిట్ట. గోకరకొండ వెంకటేశ్వరావు, వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె నవ్యశ్రీ ఇప్పటికే చిత్రకళలో తనకంటూ గుర్తింపును తెచ్చుకుంది. ఇటీవల అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ నవ్యశ్రీ ఇంటికి వచ్చి తన తండ్రి వెంకటేశ్వరావుతో మాట్లాడుతున్నారు. ఆయన మాట్లాడి వెళ్లిపోతున్న సమయంలో నవ్యశ్రీ ఇంట్లోంచి వచ్చి ఆయనకు ఓ చిత్రాన్ని అందించింది. ఆ చిత్రాన్ని చూచి తాతాజీ ఆశ్చర్యపోయారు. తన రూపాన్నే తనకు చిత్రంగా మలచి బహుమతిగా ఇచ్చిన బాలిక ప్రతిభకు మంత్రముగ్ధులయ్యారు. అమలాపురానికి చెందిన హైదరాబాద్, విశాఖ మెట్రో కెమ్ కంపెనీల అధినేత డాక్టర్ నందెపు బాలాజీ దంపతుల చిత్రాన్ని సైతం గీచి ఆ దంపతులకు బహుమతిగా అందజేసింది. సినీ హీరోలు అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్.. ఇలా సినీ ప్రముఖుల చిత్రాలెన్నో గీచింది. కాపు నాయకుడు దివంగత వంగవీటి మోహనరంగా చిత్రాన్ని చూచిన వారెందరో బాలికను ప్రశంసలతో ముంచెత్తారు. ఆమె గీచిన చిత్రాలు ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. ఇప్పటి దాకా వందకు పైగా పెన్సిల్ ఆర్ట్ చిత్రాలు గీసింది. ఈ చిత్రాలను తన ఇన్‌స్టా పేజీల్లో పోస్టు చేయడంతో ఆమె చిత్రాలకు అభిమానులు పెరిగారు.

అంతర్వేదికి వీహెచ్‌పీ మహిళలు



అంతర్వేదికి వెళుతున్న బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న భజరంగ్ దళ్ రాష్ట్ర సహాయ ప్రముఖ్ నాయుడు

అమలాపురం టౌన్: అంతర్వేది ఉత్సవాల్లో వేయి మంది మహిళలతో నిర్వహించే సామూహిక లలితా సహస్ర నామ పారాయణ క్రతువులో పాల్గొనేందుకు అమలాపురం నుంచి విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ)కు చెందిన దాదాపు 150 మంది మహిళలు అయిదు బస్సుల్లో ఆదివారం ఉదయం బయలుదేరి వెళ్లారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, అంతర్వేది ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దిరిశాల బాలాజీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సామూహిక పారాయణం ఆదివారం మధ్యాహ్నం నుంచి జరుగుతుందని భజరంగ్ దళ్ రాష్ట్ర సహాయ ప్రముఖ్ శిరంగు నాయుడు అమలాపురంలో తెలిపారు. పట్టణంలోని గాంధీనగర్, విత్తనాల వారి కాల్వగట్టు, ఎర్ర వంతెన, గడియారం స్తంభం సెంటరు, పేరూరు ప్రాంతాల నుంచి అయిదు బస్సుల్లో వీహెచ్‌పీ మహిళలు అంతర్వేదికి తరలి వెళ్లారు. ఈ బస్సు యాత్రకు భజరంగ్ దళ్ ప్రతినిధి శిరంగు నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో భజరంగ్ దళ్, వీహెచ్‌పీ ప్రతినిధులు ఊటుకూరి సాంబయ్య, దూలం బుజ్జి, కత్రి పార్థసారధి, జి.విజయలక్ష్మి, దుర్గా వాహిని, జిల్లా ప్రముఖ్ గుత్తుల సుగుణ, జి.సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: నియోజకవర్గ పరిధిలో పుదుచ్చేరి స్లమ్ క్లియరెన్స్ బోర్డు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా చేపడుతున్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ అతిథిగృహం వద్ద ఆయా గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఆర్థిక సహాయ చెక్కులను పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. 62 మంది లబ్ధిదారులకు గానూ రూ.58.80 లక్షలు పంపిణీ చేశారు. ఇప్పటికే గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి ఒరిజినల్ పట్టా డాక్యుమెంట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, స్లమ్ క్లియరెన్స్ బోర్డు అధికారులు సుందరరాజు, ఏఈ అనిల్‌కుమార్, జేఈ భాస్కరన్, అర్ముగం తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి వైస్ ఛాన్సలర్‌ను నియమించాలి

యానాం: పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్శిటీకి పర్మినెంట్ వైస్ ఛాన్సలర్‌ను నియమించాలని ప్రతిపక్ష డీఎంకే నేత ఆర్ శివ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్శిటీ పరిధిలో యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవుల రీజియన్‌ల పరిధిలో మొత్తం 59 గుర్తింపు కలిగిన కళాశాలలు ఉన్నాయన్నారు. మెడికల్, ఇంజనీరింగ్, ఆర్ట్స్ అండ్ సైన్స్ గ్రూపుల్లో 7 వేల మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. సెమిస్టర్ పరీక్షలకు ఇప్పటి వరకు ప్రశ్నా పత్రాలు తయారు చేయాలేదని ఆరోపించారు. దీంతో పరీక్షలను వాయిదా వేసారని దీనికి కేవలం యూనివర్శిటీ నిర్లక్ష్య వైఖరే కారణమన్నారు. నూతన విద్యా విధానం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అన్నారు. తక్షణం పూర్తిస్థాయిలో వైస్ ఛాన్సలర్‌ను నియమించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన యువకుడు

ముమ్మిడివరం: మండలంలోని అన్నంపల్లి అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. యానాం నుంచి పల్లంకుర్రుకు మోటారు సైకిల్‌పై వెళుతున్న ముగ్గురు యువకులు ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను తప్పించబోయి డివైడరును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో పల్లంకుర్రు శివారు ఐచెరువుకు చెందిన బూల చింటూ (20) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో అమలాపురం ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

గృహ వాస్తుపై అవగాహన



సత్యనారాయణను సత్కరిస్తున్న క్లబ్ అధ్యక్షుడు వరప్రసాద్ తదితరులు

అమలాపురం రూరల్: అమలాపురం వాక్సర్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్‌కేబీఆర్ కళాశాలలో గృహ వాస్తుపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ వాస్తు శాస్త్ర నిపుణుడు తిక్కిరెడ్డి సత్యనారాయణ గృహవాస్తు సమస్యల గురించి అవగాహన కల్పించారు. క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, కార్యదర్శి బూరగాయిల శివరామకృష్ణ ఆధ్వర్యంలో వాస్తు శాస్త్ర నిపుణుడు సత్యనారాయణను సత్కరించారు. కోశాధికారి పడాల నాయుడు, క్లబ్ సభ్యులు నూకల సత్యనారాయణ, పట్నాల రమణ, వలవల వెంకట రెడ్డి నాయుడు, డాక్టర్ విష్ణుమూర్తి, మనోహర్ కిమ్స్, సురేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐలో మెగా హోమ్‌లోన్ మేళా

యానాం: స్థానిక స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) బ్రాంచిలో మెగా హోమ్‌లోన్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆదివారం బ్యాంక్ మేనేజర్ కళ్యాణ్ తేజస్వి తెలిపారు. ఈ మేళా అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అతి తక్కువ సమయంలో రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాసెసింగ్ చార్జీలు, వడ్డీరేట్లు తక్కువగా ఉంటాయని, నెలావారీ ఈఎంఐలు సైతం తక్కువ మొత్తంలో ఉంటాయని సూచించారు.

త్రాచుపాము కలకలం



పామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ వర్మ

అమలాపురం రూరల్: మండలంలోని ఈదరపల్లిలో ఓ వైన్ షాప్ వద్ద శనివారం రాత్రి భారీ త్రాచుపాము హల్‌చల్ చేసింది. దీంతో షాపులోని ఉద్యోగులు, అక్కడే ఉన్న కొందరు వ్యక్తులు భయాందోళన చెందారు. వెంటనే ఉప్పలగుప్తం మండలంలోని భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్‌కు వర్మకు సమాచారం అందించారు. వర్మ ఘటన స్థలానికి చేరుకుని పామును చాకచక్యంగా పట్టుకొని బంధించారు.

కోదండరామస్వామి విగ్రహాలకు గ్రామోత్సవం

ఆలమూరు: మండలంలోని నర్సిపూడిలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు ఆదివారం గ్రామోత్సవం జరిగింది. ఆలయ కమిటీ నిర్వాహకులు ఈ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని విగ్రహాలను ట్రాక్టర్‌పై విగ్రహాలను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ నూతన విగ్రహాలను భక్తులు సందర్శించుకుని కానుకలు సమర్పించారు.

న్యాయవ్యాదిపై కేసు రద్దు చేయాలి

ముమ్మిడివరం: ఓ సివిల్ కేసుకు సంబంధించిన వ్యవహారంలో ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్ న్యాయవాది బందా సుబ్రహ్మణ్యేశ్వరరావుపై పెట్టిన కేసును రద్దు చేయాలని ఆంధ్రా లాయర్స్ అసోషియేషన్ డిమాండ్ చేసింది. అసోషియేషన్ అధ్యక్షులు ఎంవీ రాజారామ్, ప్రధాన కార్యదర్శి మేడ శ్రీనివాసులు ముమ్మిడివరంలో మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలో అయినాపురానికి చెందిన సివిల్ కేసులో ముద్దాయిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న బొర్రా సత్య సోమేశ్వరరావు, బొర్రా వెంకట కృష్ణారావులకు సంబంధించి ముమ్మిడివరం న్యాయవాది బందా సుబ్రహ్మణ్యేశ్వరరావు అనేక సివిల్ కేసుల్లో న్యాయవాదిగా కొనసాగుతున్నారు. వాది, ప్రతివాదుల మధ్య వివాదంలో ఎస్సై జ్వాలా సాగర్ న్యాయవాది బందా సుబ్రహ్మణ్యేశ్వరరావుపై అన్యాయంగా కేసు పెట్టి మానసిక వేధింపులకు గురిచేయటం అధికార దుర్వినియోగ చర్యగా భావించాలని వారు పేర్కొన్నారు. దీనిపై జిల్లా ఎస్పీ ప్రత్యేక దర్యాప్తుకు ఆదేశించి ఎస్సైపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై డీజీపీని కలిసి న్యాయవాది సుబ్రహ్మణ్యేశ్వరరావుపై పెట్టిన కేసుపై వివరిస్తామన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న మాజీ ఐఆర్ఎస్ అధికారి మూర్తి

అమలాపురం రూరల్: మండలంలోని ఈదరపల్లిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కాలిపోయి సర్వస్వం కోల్పోయిన బాధితులకు తాళ్ల సరస్వతీ ముత్యాలు చారిటబుల్ ట్రస్ట్ తరుపున ట్రస్ట్ చైర్మన్, మాజీ ఐఆర్ఎస్ అధికారి టీఎస్ఎన్ మూర్తి సాయం అందించారు. బాధితులు దాకే మంగాయమ్మ, కుంచే మరియమ్మ, మంగం పద్మ కుటుంబాలకు నిత్యావసరాలతో పాటు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్, బూల విజయ్‌బాబు, నాతి శ్రీనివాసరావు, గోసంగి ఆనందరావు, కడిమి అర్జున్, బొంతు శ్రీను, కడిమి చిన్నబాబు, మద్దుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

ఉపాధ్యాయుడికి సేవా పురస్కారం



ఉపాధ్యాయుడు దుర్గారావును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి, గజల్ శ్రీనివాస్

అమలాపురం రూరల్: రాజమహేంద్రవరంలో ధర్మంచర ఫంక్షన్ హాల్‌లో గోదావరి ఉత్సవం -2025 సందర్భంగా అమలాపురం మండలం ఈదరపల్లి గ్రామానికి చెందిన కడిమి వెంకట సత్య దుర్గారావు ఉపాధ్యాయుడిగా ఉత్తమ సేవలు అందించినందుకు గానూ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి, గజల్ శ్రీనివాస్, అద్దంకి రాజాలు ఉత్తమ సేవా పురస్కారంతో సత్కరించారు. అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో ఆదివారం రాష్ట్ర బుద్దిస్ట్ సొసైటీ అధ్యక్షుడు హరిబాబు, జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు కాశీ రాంభోది, బీఎస్పీ ప్రధాన కార్యదర్శి ములపర్తి సత్యనారాయణ, బుద్ధ విహార్ చైర్మన్ నాగాబత్తుల ప్రసాదరావు, సభ్యులు కాశీ వెంకటరావు, ఈఈవీ సత్యనారాయణ తదితరులు సత్య దుర్గారావును సత్కరించారు.

బడ్జెట్‌లో పుదుచ్చేరికి రూ.3,432 కోట్ల కేటాయింపు

యానాం: పుదుచ్చేరి అవసరాలు తీర్చడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని 90 శాతం మేర రాష్ట్ర బడ్జెట్‌కు కావాల్సిన నిధులు సమకూరుతున్నాయని కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ఎల్ మురుగన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుదుచ్చేరిలో ఎటువంటి ఆర్థిక సంక్షోభం లేదని కేంద్రం అన్ని నిధులు సమకూరుస్తుండడంతో నిధుల లోటు ఎందుకు తలెత్తుతుందని ప్రశ్నించారు. కేంద్రం ఇప్పటికే రూ.3,432 కోట్లు పుదుచ్చేరికి 2025-26 కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిందన్నారు. దీనితో పాటు జిప్‌మెర్‌లో సదుపాయాల కల్పనకు రూ.1,450 కోట్లు కేటాయించిందన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.186.44 కోట్లు, కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా 16 వేల రైతులకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఋణ పరిమితిని పెంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పుదుచ్చేరి ఇన్‌చార్జి నిర్మలకుమార్ సురేనా, హోంమంత్రి నమశ్శివాయం పాల్గొన్నారు.

మూడు మద్యం షాపులకు 84 దరఖాస్తులు

ఆలమూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని ఆలమూరు, మండపేట టౌన్, కపిలేశ్వరపురం మండలాలకు గీత కార్మికుల కోసం కేటాయించిన మూడు మద్యం షాపులకు 84 దరఖాస్తులు అందినట్లు సీఐ ఐడీ నాగేశ్వరరావు తెలిపారు. ఈసందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా సంబంధించి ఆలమూరుకు 31, కపిలేశ్వరపురం 17, మండపేట టౌన్‌కు 36 దరఖాస్తులు అందాయన్నారు. ఈ దరఖాస్తులన్నింటికీ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించమన్నారు. ఈనెల 10న లాటరీ విధానంలో ముగ్గురికి ఈ మద్యం షాపులు కేటాయించనున్నట్లు సీఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు.